# జమ్మూకశ్మీర్ బిల్లులకు మద్దతు

- ఎస్సీ రిజర్వేషన్‌కు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది
- వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలి: ఎంపీ నామా
- లోక్‌సభ సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లులపై చర్చ



న్యూఢిల్లీ, డిసెంబర్ 6: జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లుతోపాటు ఆ రాష్ట్ర రీఆర్గనేషన్ సవరణ బిల్లులకు కూడా తమ పార్టీ మద్దతు ఇస్తోందని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ రెండు బిల్లులపై లోక్‌సభలో బజరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల జనగణనను సత్వరమే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌కు తమ పార్టీ కట్టుబడి ఉందని, 2014 నవంబర్ 29నే అప్పటి తమ పార్టీ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తమ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. ఇప్పటికీ ఆ బిల్లు కేంద్రం వద్దనే పెండింగ్‌లోనే ఉందని అన్నారు. అయితే, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉన్నప్పటికీ ఇంకా పెంచలేదని, అందుకని ఆ అంశాన్ని త్వరితగతిన తేల్చాలని అన్నారు. అలాగే, తెలంగాణలో బీసీలుగా ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీలుగా పరిగణిస్తూ వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

# భరతమాత ముద్దుబిడ్డ అంబేద్కర్

- ఆయన స్ఫూర్తితో ఆయన బాటలోనే ఉద్యమనేత కేసీఆర్ పయనం
- బాబాసాహెబ్ వర్ధంతి సభలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం, ఎమ్మెల్సీ మధు, రాములునాయక్, సండ్ర

ఖమ్మం, డిసెంబర్ 6: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భరత మాత ముద్దుబిడ్డ అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన బాటలోనే ఉద్యమనేత కేసీఆర్ పయనించారని గుర్తుచేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాజ్యాంగ నిర్మాత వర్ధంతి సభకు ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అజయ్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ఎత్తయిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పిన ఘనత, తెలంగాణ పరిపాలన భవనం సెక్రటేరియట్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు



పాగాల సంపత్‌రెడ్డి సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

పెట్టి ఆ మహనీయుడిని గౌరవించుకున్న చరిత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**గెలిస్తే పొంగేదిలేదు.. ఓడితే కుంగేది లేదు..: అజయ్**

ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని, ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమేనని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గెలిస్తే పొంగేదిలేదని, ఓడితే కుంగేదిలేదని స్పష్టం చేశారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, అక్కడి జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి (55) మృతి పట్ల ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను ఒక్కొక్కరిని కలిసి ఓటమి గురించి బాధపడవద్దని ధైర్యం చెప్పారు.

**శ్రేణులు అధైర్యపడొద్దు: తాతా మధు**

అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఓటమి ఎదురైనంత మాత్రాన పార్టీ శ్రేణులు అధైర్యపడాల్సిన పనిలేదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. ఓటమి చెందినప్పటికీ ప్రజాక్షేత్రంలోనే ఉందామని, శ్రేణులకు అండగా నిలుద్దామని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

**పలు మండలాల్లో మునిగిన పంటలు, కూలిన ఇళ్ల పరిశీలన**



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్

దమ్మపేట/ అశ్వారావుపేట రూరల్/ పాల్వంచ రూరల్/ రఘునాథపాలెం, డిసెంబర్ 6: తుఫాన్ ప్రభావంతో దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో దెబ్బతిన్న పంటలను భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక బుధవారం పరిశీలించారు. తొలుత ఆర్డీవో శిరీష, ఇతర ఉన్నతాధికారులతో కలిసి దమ్మపేటకు వచ్చిన ఆమె.. సుధాపల్లిలో దెబ్బతిన్న వేరుశెనగ పంటను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. దెబ్బతిన్న పంటల వివరాలను తక్షణమే తనకు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పేరంటాలచెరువు, మరిగొమ్ము కాలువ తెగిపోవడంతో ఆ ప్రాంతాన్ని కూడా పరిశీలించి కాలువకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. దమ్మపేటలోని కల్యాణమండపం వీధిలో నీటమునిగిన ఇళ్ల వద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడారు.

**ఉట్లపల్లిలో దెబ్బతిన గృహాల పరిశీలన..**

అశ్వారావుపేట రూరల్ మండలంలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న గృహాలను కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. ధ్వంసమైన సోయం చిన్న వెంకటేశ్, పద్దం మునెమ్మ, తామ చిలకమ్మ గృహాల వద్దకు వెళ్లి పరిశీలించారు. నష్టం అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ పాల్గొన్నారు. కాగా, అదే గ్రామంలో మరికొన్ని ఇళ్లు కూడా వర్షాలకు దెబ్బతినగా కలెక్టర్ ఆ ఇళ్లను పరిశీలించకుండానే వెనుదిరిగారు. దీంతో ఆ గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రఘునాథపాలెంలో..**

తుఫాన్ వల్ల రఘునాథపాలెం మండలంలో 1737 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో మొక్కజొన్న, 750 ఎకరాల్లో మిరప పంటలు దెబ్బతిన్నట్లు ఏవో ఇంటూరి భాస్కర్‌రావు తెలిపారు. ఈ మేరకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో ఏడీఏ శ్రీనివాసరావుతో కలిసి బుధవారం పరిశీలించారు.

**'కిన్నెరసాని' నుంచి నీటి విడుదల**

తుఫాన్ కారణంగా పాల్వంచ కిన్నెరసాని ప్రాజెక్ట్‌లోకి బుధవారం భారీగా వరద చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా ఉదయం ప్రవాహం 404.8 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 8 వేల అడుగులుంది. అప్రమత్తమైన అధికారులు అదే ఇన్‌ఫ్లోను రెంటు గేట్లు తెరిచి దిగువకు వదిలారు. వరద కారణంగా దిగువన రాజాపురం చప్టా నీట మునిగి 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంపువాసులకు ముందస్తుగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేశారు.

# కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాలేదని..

# బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

**ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం హర్యాతండాలో ఘటన**



బద్యా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

రఘునాథపాలెం, డిసెంబర్ 6: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అసంతృప్తి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అయిన ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాలేదనే బాధతో బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం హర్యాతండాలో బుధవారం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్ కథనం ప్రకారం.. హర్యాతండా గ్రామానికి చెందిన మాళోతు బద్యా బీఆర్ఎస్ కార్యకర్తగా ఉంటూనే చిన్న రైతుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ విజయం సాధించకపోవడం, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాకపోవడం వంటి కారణాలతో మనస్తాపం చెందాడు. కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పినా అప్పటి నుంచి దిగులుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం నాడు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇంతలో బీఆర్ఎస్ నాయకులు కూడా విషయం తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లి అతడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బద్యా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు వీరూనాయక్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బద్యాను పలువురు బీఆర్ఎస్ నాయకులు చూసి అతడి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

# 83 వేల ఎకరాలు.. 53 వేల రైతులు..

- వానకాలం పంటలపై మిగ్‌జాం తుపాన్ ప్రభావం
- ప్రాథమిక నివేదిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

ఖమ్మం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మిగ్‌జాం తుఫాన్ ప్రభావం ఖమ్మం జిల్లాలోని వానకాలం పంటలపై తీవ్రంగా పడింది. తుఫాన్ కారణంగా రెండురోజులుగా కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 53,903 మంది రైతులకు సంబంధించిన 82,191 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. ముఖ్యంగా 357 గ్రామాల్లో 39,276 మంది రైతులకు చెందిన 59,307 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. 368 మంది రైతులకు చెందిన 348 ఎకరాల్లో పత్తి పంట, 3,031 మంది రైతులకు చెందిన 5,262 ఎకరాల్లో మొక్కజొన్న పంటల పూర్తిగా దెబ్బతిన్నాయి. ముగ్గురు రైతులకు చెందిన 7 ఎకరాల్లో మినుము, 11,225 మంది రైతులకు చెందిన 17,267 ఎకరాల్లో మిర్చి పంటలు దెబ్బతిన్నాయి.

| మండలం | రైతులు | ఎకరాలు |
|---|---|---|
| ఖమ్మం అర్బన్ | 85 | 120 |
| రఘునాథపాలెం | 2007 | 2,537 |
| కామేపల్లి | 1,550 | 3,150 |
| మధిర | 1,773 | 2,761 |
| చింతకాని | 2,496 | 3,953 |
| ఎర్రుపాలెం | 3,559 | 5,023 |
| ముదిగొండ | 2,955 | 4,082 |
| బోనకల్లు | 1,304 | 2,267 |
| నేలకొండపల్లి | 333 | 605 |
| కూసుమంచి | 708 | 950 |
| ఖమ్మం రూరల్ | 705 | 875 |
| తిరుమలాయపాలెం | 601 | 795 |
| సత్తుపల్లి | 520 | 1,869 |
| పెనుబల్లి | 3,243 | 5,669 |
| కల్లూరు | 6,170 | 8,734 |
| తల్లాడ | 2,878 | 5,663 |
| కారేపల్లి | 4,952 | 6150 |
| వైరా | 6,853 | 10,450 |
| ఏన్కూరు | 2,815 | 4,392 |
| కొణిజర్ల | 4,950 | 6,540 |

# డేటాను నూరుశాతం ఎంట్రీ చేయాలి: కలెక్టర్



ఎంఈవోల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 6: యూడైస్ డేటాను, ఎఫ్ఆర్ఎస్ హాజరును కచ్చితత్వంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యత హెచ్ఎంలదేనని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల స్పష్టం చేశారు. విద్యార్థుల వివరాల నమోదుపై ఎంఈవోలు, పాఠశాలల అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రతి పాఠశాలలోనూ యూడైస్ ప్లస్ డేటా కచ్చితంగా నమోదు చేయాలని, తప్పుగా ఎవరైనా నమోదు చేస్తే ఆ పాఠశాల హెచ్ఎంలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎంలు కూడా అన్ని పాఠశాలలనూ తనిఖీ చేసి క్రోడీకరించిన డేటా సరిగా ఉందో లేదో చూడాలని, వారు నిర్ధారించాకే సంతకం చేసిన ఫార్మేట్‌ను ఎంఈవోలకు అందజేయాలని సూచించారు.

# 'మహనీయుడు డాక్టర్ అంబేద్కర్'



అంబేద్కర్ చిత్రపటంపై పూలు చల్లుతున్న నేతలు

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, బహుజనులకు ప్రాథమిక హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వివిధ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రజలు పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు నగరంలోని జడ్పీసెంటర్‌లో ఉన్న బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. –నెట్‌వర్క్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616